

టీడీపీ నేత వైఎస్సార్ సీపీలో చేరిక


టీడీపీ నేత హేమాద్రి రజాక్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత మల్లంపల్లి హేమాద్రి రజాక్ మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నేత హేమాద్రి రజాక్‌తో పాటు ఆయన అనుచరులకు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హేమాద్రి రజాక్ మాట్లాడుతూ టీడీపీలో బీసీలకు తగిన గుర్తింపు లేదని, అందుకే ఆ పార్టీని వీడినట్లు చెప్పారు. ఘంటసాల మండలంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఘంటసాల మండల కన్వీనర్ వేమూరి వెంకట్రావ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిట్టూర్పు సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దాసరి కుటుంబరావు, బూసి సుబ్రహ్మణ్యం, వక్కలగడ్డ శ్రీనివాసరావు, పోలవరపు రమేష్, అవనిగడ్డ మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు చింతలపూడి బాలు, మాజీ సర్పంచ్ సైకం బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

3 అర్జీలు స్వీకరణ

మెరకనపల్లి(మోపిదేవి): మండలంలోని మెరకనపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు గ్రామ సర్పంచ్ ఎర్రంసెట్టి ధనరాజ్యలక్ష్మి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సులో గ్రామానికి చెందిన రైతుల నుంచి మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీవిద్య తెలిపారు. ఈ కార్యక్రజుమంలో మండల సర్వేయర్ రామకృష్ణబాబు, వీఆర్ఓ మోపిదేవి వెంకటేశ్వరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని జయప్రదం చేద్దాం



పెడన: హైందవ శంఖారావం సభను విజయవంతం చేయడానికి ప్రతి హిందువు కూడా తరలి రావాలని భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్, హిందూ బంధువుల ఐక్యవేదిక సభ్యులు కోరారు. మంగళవారం పట్టణంలోని పలు దేవాలయాలకు చెందిన కమిటీలకు కరపత్రాలను అందజేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో 2025 జనవరి ఐదో తేదీన గన్నవరం మండలం కేసరపల్లి వద్ద జరగనున్న రాష్ట్ర స్థాయి హైందవ శంఖారవం సభకు హాజరై జయప్రదం చేయాల్సిందిగా కోరారు. 16వ వార్డులోని కోదండరామాలయం, ఒకటో వార్డులోని పైడమ్మ దేవస్థానం, శ్రీవిజయగణపతి ఆలయం, గూడూరు రైల్వే గేటు సమీపంలోని శ్రీసీతారామ స్వామి దేవాలయం, బల్లకట్టు కాలువ వద్ద విఘ్నేశ్వరస్వామి ఆలయాలకు చెందిన కమిటీ సభ్యులను కలిసి కరపత్రాలను అందజేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



కోడూరు: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన రెండు బాధిత కుటుంబాలకు పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాసరావు ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని నక్కవానిదారి గ్రామానికి చెందిన అప్పికట్ల సుబ్బారావు, కోడూరుకు చెందిన ఆకురాతి సాంబయ్య నివాస గృహాలు ఇటీవల ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు బాధితులను పరామర్శించి, ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేల వంతున నగదు, సరుకులను అందజేశారు. వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

మండలంలో 1,390 మంది పట్టభద్రుల ఓటర్లు


తహసీల్దారు అనిల్‌కుమార్

పెడన: మండలంలో పట్టభద్రుల ఓటర్లు 1,390 మంది ఉన్నారని పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నూతనంగా ఓటర్లు జాబితాలను తయారు చేయాలని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. పలు దఫాలుగా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామని, ముసాయిదా జాబితా ప్రకటన కూడా చేశామన్నారు. తహసీల్దారు కార్యాలయంలో, ఆన్‌లైన్ ద్వారా డిగ్రీ ఉత్తీర్ణులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానించామని తెలిపారు. విచారణ అనంతరం నివేదికలను, సర్టిఫికెట్లను ఉన్నతాధికారులకు పంపించామన్నారు. వారు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తుదిజాబితాను పంపించారని, వాటిని తమ కార్యాలయంలో, మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంచామని తెలిపారు. మండలంలో 1,390 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 813, మహిళలు 577 మంది ఉన్నారన్నారు. పట్టభద్రులు తమ ఓటు ఉందో లేదో పరిశీలించు కోవాల్సిందిగా కోరారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ఘంటసాల: ఘంటసాలలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మంగళవారం పెన్షన్లు పంపిణీ చేశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న లోయ రాజబాబుకు మంజూరైన పెన్షన్ రూ.10 వేలను అందించడంతో పాటు నవంబర్ నెలలో గ్రామంలో 11 మంది వృద్ధులు చనిపోగా వారి భార్యలకు డిసెంబర్ నెలలో వితంతు పెన్షన్లు అందించారు. ఎంపీడీవో డి.సుబ్బారావు, తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఈవో తాడేపల్లి జయలక్ష్మి, వీఆర్వో లక్ష్మీతిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

94 శాతం పింఛన్ల పంపిణీ

మోపిదేవి: మండలంలో మొత్తం 6,136 పింఛన్లకు గాను 5,802 మందికి పింఛన్‌లు అందజేసి 94.56 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో స్వర్ణభారతి మంగళవారం తెలిపారు. తెల్లవారుజాము నుంచే లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. మోపిదేవి పంచాయతీ పరిధిలోని బోడగుంట గ్రామంలో సర్పంచ్ నందిగం మేరీరాణి, ఎంపీటీసీ- 2 సభ్యులు కొమ్ము పవన్ లబ్ధిదారులకు పింఛన్‌లు అందజేశారు.

ఎస్సీ సర్వే లిస్టు ప్రదర్శించాలి

అవనిగడ్డ: ఎస్సీ జనాభా సర్వే లిస్టు తప్పుల తడకగా ఉన్నందున అందరూ పరిశీలించుకునేందుకు వీలుగా సచివాలయాల్లోని నోటీసు బోర్డులో ప్రదర్శించాలని జైభీమ్‌రావ్ భారత్‌పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందినవారి పేర్లు చాలావరకు లేవని, వీటిలో హిందూ మతాన్ని లిస్టులో చేర్చలేదని జైభీమ్‌రావ్ భారత్‌పార్టీ నియోజక వర్గ కన్వీనర్ సముద్రాల అంబేడ్కర్ తహసీల్దార్‌కు వివరించారు. ఎస్సీ జాబితాలో ఉన్న మాల కులస్తులందరి జాబితా ఉండేలా సచివాలయాల్లో లిస్టును ప్రదర్శించాలని కోరారు. న్యాయవాది కర్రా సుధాకరరావు, పార్టీ మండల కన్వీనర్ గొరుముచ్చు రవి పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న అంబేడ్కర్, సుధాకర్

ఈవోపీఆర్డీపై దాడికి ఉద్యోగుల నిరసన

నాగాయలంక: జిల్లాలోని పెనమలూరు మండల విస్తరణాధికారి బి.శ్రీనివాసరావుపై సోమవారం సాయంత్రం విధి నిర్వహణలో ఉన్న సమయంలో దౌర్జన్యం చేసిన సంఘటనపై నాగాయలంకలో మంగళవారం పంచాయతీ రాజ్ ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. పెనమలూరుకు చెందిన ముప్పాళ్ళ బద్రీనారాయణ అనే గ్రామస్తుడు తాను పంచాయతీపై పెట్టిన ఫిర్యాదు విషయంలో వారు చెప్పినట్టే రాయమని విస్తరణాధికారిపై దౌర్జన్యం చేశాడని, కాలర్ పట్టుకుని గుంజి పిడి గుద్దులతో మెడ పట్టుకుని బూతులు తిట్టారని ఉద్యోగులు ఆందోళన వ్యక్తపర్చారు. అంతేకాకుండా కార్యాలయం టేబుల్‌పైన ఉన్న ఫైల్స్ తోసేసి చింపేయడానికి ప్రయత్నించాడని పేర్కొన్నారు. విధుల్లో ఉన్న ప్రభుత్వోద్యోగిపై దౌర్జాన్యానికి పాల్పడ్డ బద్రీనారాయణపై చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు ప్లకార్డులు చేత పట్టుకుని నినాదాలు చేశారు. నాగాయలంక ఎంపీడీఓ జేకే సీతారామ్‌కుమార్ నేతృత్వంలో జరిగిన నిరసన కార్యక్రమంలో స్థానిక గ్రామ కార్యదర్శి జరుగు పవన్‌కుమార్, మండల గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



నాగాయలంక ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



అవనిగడ్డ ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అధికారులు

అవనిగడ్డ: పెనమలూరు ఈవోపీఆర్డీ బి.శ్రీనివాసరావుపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు మంగళవారం ధర్నా చేశారు. ఎంపీడీవో మరియకుమారి మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈవోపీఆర్డీ అరుణ, పలువురు పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: పెనమలూరు మండలంలో ఈవోపీఆర్డీ బొమ్మసాని శ్రీనివాసరావుపై దాడి అమానుషమని మచిలీపట్నం ఎంపీడీవో సీహెచ్.వెంకటేష్ పేర్కొన్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బందితో కలిసి స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయము ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి డి.శివరామకృష్ణశర్మ, పంచాయతీల కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది ప్రసంగించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

కక్ష సాధింపు

నందివాడ: లక్ష్మీనరసింహాపురంలో ఆర్‌ఓ ప్లాంట్ నిర్వహిస్తున్న తనపై అధికార పార్టీ నాయకులు కక్ష సాధింపునకు పాల్పడుతున్నట్లు చింతాడ ఓగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం మాట్లాడుతూ ఆర్‌ఓ ప్లాంట్‌కు సంబంధించి అన్ని పర్మిషన్లు ఉన్నా సరే.. ప్లాంట్ మూసేయాలని ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు.

స్కూళ్ల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

పెడన: పాఠశాలలు అభివృద్ధి జరగాలన్నా, అనుకున్న ఫలితాలు సాధించాలన్నా ఉపాధ్యాయులు, స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీల సమన్వయం చాలా అవసరమని, సమాజ భాగస్వామ్యం కూడా చాలా ముఖ్యమని కృష్ణా జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో (కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్) టి.రమేష్ అన్నారు. పెడన మండలంలోని 64 పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు, ఎస్ఎంసీల చైర్మన్లకు స్థానిక బంగ్లా స్కూల్‌లోని మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎంవో రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలలో పలు కార్యక్రమాల అమలు తీరుపై పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ సభ్యుల భాగ్యస్వామ్యం తప్పనిసరి అని అన్నారు. బడి బయట విద్యార్థులు తగ్గాలన్నా, పాఠశాలలోని అన్ని పథకాలు సకాలంలో అందాలన్న, పాఠశాల యాజమాన్య కమిటీలు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎంఈవో- 2 వై.వి.హరనాథ్, స్టేట్ రిసోర్సు పర్సన్ ఆర్ సత్యనారాయణ, రిసోర్స్ పర్సన్లు ఏఆర్ అస్లాం, పి.సురేష్, పి.సురేష్ కుమార్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లు, సభ్యులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎంవో రమేష్



కృత్తివెన్నులో మాట్లాడుతున్న ఎంఈవో ప్రసాదరావు

కృత్తివెన్ను: పాఠశాల యాజమాన్య కమిటీ బాధ్యతలు, విధి విధానాలపై అవగాహనలో భాగంగా మంగళవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో ఒక రోజు ఓరియంటేషన్ శిక్షణ నిర్వహించారు. ప్రతి పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడు, యాజమాన్య కమిటీ మెంబరు హాజరయ్యారని ఎంఈవో ఎస్‌కేడీవీ ప్రసాదరావు తెలిపారు. ఎంఈవో త్రిపురసుందరీదేవీ, ఆర్పీలు పురుషోత్తం, సూరిబాబు, నాగరాజు, చైర్మన్ రామకృష్ణ పాల్గొన్నారు.

గూడూరు: పాఠశాల నిర్వహణలో విధులు, బాధ్యతలు అనే అంశంపై మండలస్థాయి ఒకరోజు శిక్షణా తరగతులు మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఎంఈఓ- 2 పి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలప్రతినిధులకు పలు అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ డి.పుష్పలత, రిసోర్స్ పర్సన్లు, వివిధ పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గూడూరులో మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ గంగారామ్

వ్యవసాయ రంగానికి ఆధునిక టెక్నాలజీ అందించాలి

ఘంటసాల: ఆధునిక టెక్నాలజీని వ్యవసాయ రంగానికి అందించి రైతులకు మేలు చేసేందుకు శాస్త్రవేత్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో మినుము పంటలు సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధికి శాస్త్రవేత్తలు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ ప్రస్తుతం మినుము పంటలో పొగాకు లద్దె పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని దీని నివారణకు వేప సంబంధిత మందులు పిచికారి చేయాలని రైతులకు సూచించారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సత్యప్రియ లలిత మాట్లాడారు. కేవీకే ప్రాంగణంలో ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మొక్కలు నాటగా కేవీకే ఆధ్వర్యంలో సన్మానించారు. సర్పంచ్ బాణావత్తు వెంకటేశ్వరమ్మ, ఏవో కె.మురళీ కృష్ణ కేవీకే పరిధిలోని రైతులు, కేవీకే, ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఘంటసాల కేవీకేలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

బంగారం, నగలు చోరీ

లంకపల్లి(ఘంటసాల): మండలంలోని లంకపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు లుక్కా కోటేశ్వరరావు ఇంటిలో చోరీ జరిగినట్లు ఎస్ఐ కె.ప్రతాప్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కోటేశ్వరరావు చిన్న కుమార్తె డెలివరీ నిమిత్తం ఈ నెల 24న కుటుంబ సభ్యులతో విజయవాడ వెళ్లారు. సోమవారం కోటేశ్వరరావు ఇంటి తలుపులు తెరచి ఉండటం చూసిన స్థానికులు ఆయనకు సమాచారం అందించారు. దీంతో ఇంటికి చేరుకున్న కోటేశ్వరరావు కుటుంబ సభ్యులు ఇంటిలోకి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉన్న రూ.50 వేల నగదు, 75 గ్రాముల బంగారం చోరికి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్, సీఐ కె.ఈశ్వరరావు ఎస్ఐ ప్రతాప్ రెడ్డితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కోటేశ్వరరావు నుంచి వివరాల సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.



'చేనేత' క్యాలెండర్ ఆవిష్కరణ

పెడన: ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ -2025ను స్థానిక సర్వోదయ సొసైటీలో మంగళవారం సీపీఐ సీనియర్ నాయకుడు మోదుమూడి రామారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ చేనేత వస్త్రాలపై జీఎస్టీని రద్దు చేయాలన్నారు. ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కట్టా హేమ సుందరరావు, కృష్ణా జిల్లా చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు కోదాటి నారాయణరావు, పెడన నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పేరిశెట్టి ఉమాకాంతారావు, బాలసుబ్రహ్మణ్యం, చిన కొండయ్య, గురున్నాథరావు, విఘ్నేశ్వరరావు, కోటిలింగం, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రామారావు తదితరులు

పబ్లిక్ నోటీసు

[illegible]

క్లుప్తంగా

బాస్కెట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల సత్తా



గుడివాడ టౌన్: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థులు బంగారు పతకం సాధించినట్లు మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ హెచ్‌ఎం జి. పద్మావతి అన్నారు. మంగళవారం పతకం సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. చిత్తూరు జిల్లాలో జరిగిన బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థులు అబ్దుల్ రహమాన్, జ్యోతి గణేష్, శివ, ధనుష్, రాకేష్ విజయం సాధించారన్నారు. పాఠశాల ప్రెసిడెంట్ వి. లక్ష్మి, కరస్పాండెంట్ రమాదుర్గ పాల్గొన్నారు.

సమాజంలో అందరూ సమానమే

పామర్రు: సమాజంలో అందరూ సమానమని జీవనానికి అన్ని రంగాలకు సంబంధించిన వ్యక్తులూ అవసరమని పామర్రు ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పామర్రు మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శివరామ సినీ థియేటర్ ప్రాంగణంలోని ఎన్టీఆర్ స్టూడియో వద్ద నూతన సంవత్సర ఆహ్వాన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఐ కేక్‌ను కట్ చేసి అనంతరం మాట్లాడారు. మానవత అధ్యక్షుడు పామర్తి వెంకట నారాయణ, రీజియన్ చైర్మన్ పీఎంఎస్ ప్రసాద్, కన్వీనర్ త్రివిక్రమరావు పాల్గొన్నారు.

స్టేడియం క్రీడాకారుల ప్రతిభ



గుడివాడ టౌన్: రాష్ట్ర స్థాయి అంతర్ పాఠశాలల ఓపెన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో తమ క్రీడాకారులు ప్రథమ స్థానం సాధించారని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్టేడియం కార్యాలయంలో విజేతలైన క్రీడాకారులను సత్కరించారు. విజేతలైన క్రీడాకారులను, కోచ్ జె. మల్లికార్జునరావును స్టేడియం కమిటీ సభ్యులు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

గుడివాడ టౌన్: విద్యార్థులపై ఒత్తిడి లేని విద్య, వ్యక్తిత్వ వికాసం అవసరమని ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ క్రాప్స్ రాష్ట్ర డైరెక్టర్ పి.స్రవంతి అన్నారు. మంగళవారం స్థానిక వికాస్ రైన్‌బో హైస్కూల్, విద్యాలయ హైస్కూల్లో పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సేవ్ ఎనర్జి, సేవ్ వాటర్, సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్, అడాప్ట్ సస్టైనబుల్ ఫుడ్ సిస్టమ్, రెడ్యూస్ వేస్ట్ తదితర అంశాలపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలల డైరెక్టర్లు పి.రామచంద్ర శేఖర్, విద్యాలయ డైరెక్టర్ బొప్పన వెంకట భాస్కర్ పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్లపై ఎక్సైజ్ దాడులు



గుడివాడరూరల్: పట్టణంలోని బార్ అండ్ రెస్టారెంట్లపై ఎక్సైజ్‌శాఖ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ సుస్మిత, సిబ్బంది బార్లను తనిఖీ చేశారు. 24 గంటలు మద్యం విక్రయిస్తున్న బార్లపై కేసులు నమోదు చేశారు. సీఐ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా సమయ పాలన మించి విక్రయాలు చేపడుతున్న బార్లను గుర్తించి యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు.

బాలిక అదృశ్యం

పెనమలూరు: పోరంకిలో బాలిక అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పోరంకి బ్రహ్మంగారి గుడి వద్ద ఉయ్యూరు వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతని కుమార్తె (16) పోరంకిలో సూపర్‌మార్కెట్‌లో పని చేస్తుంది. కాగా సోమవారం పనికి వెళ్లిన కుమార్తె ఇంటికి వచ్చి తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాను ఇంట్లోనే ఉన్నానని చెప్పింది. కాగా సాయంత్రం తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూసేసరికి కుమార్తె ఇంట్లో కనబడలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ఉయ్యూరు: తాతినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీనివాస అక్షరాలయంలో మంగళవారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాతినేని విజయ్‌బాబు, సాయి ప్రత్యూష మాట్లాడుతూ లక్ష్య సాధన, ఆత్మ విశ్వాసం, సాంకేతికత, పర్యావరణం తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు.

● సర్వత్రా 'నూతన' సందడి



నాగాయలంకలో బేకరీల ఎదుట వెలసిన కేక్‌ల ప్రత్యేక కౌంటర్ వద్ద సందడి

నూతన సంవత్సర వేడుకలు మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో ప్రజలు అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుకాణాల నుంచి కేకులు, పండ్లు, పూలను కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకున్నారు. రాత్రి 12 గంటలు దాటగానే ఒక్కసారిగా కేరింతలు కొట్టి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. కేక్‌లు కట్‌చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్మార్ట్ ఫోన్‌లలో మెసేజ్‌లు, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, టెలిగ్రాం తదితరాల ద్వారా శుభాకాంక్షలు తెలిపే ఫొటోలు, రీల్స్‌ను షేర్ చేశారు.

– మచిలీపట్నంటౌన్/పెడన/కోడూరు/నాగాయలంక



మచిలీపట్నం పట్టణంలో కేక్‌ల విక్రయాలు



పెడన ప్రధాన రహదారిలో కేక్‌ల దుకాణం

చేతికొచ్చిన పంట బుగ్గిపాలు

- నక్కవానిదారి గ్రామంలో ఆరేళ్లుగా వరికుప్పలకు నిప్పు
- ప్రతి ఏటా పెరుగుతున్న బాధిత రైతుల సంఖ్య
- నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలం



ఘటనా స్థలంలో తనిఖీలు చేస్తున్న డాగ్‌స్క్వాడ్, పోలీసుల తనిఖీ (ఫైల్)

కోడూరు: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరిపంటలను బుగ్గిపాలు చేసే విషసంస్కృతికి అడ్డుకట్ట పడటం లేదు. మండలంలో ఆరేళ్లుగా గుర్తు తెలియని దుండగులు వరికుప్పలకు నిప్పు పెట్టడంతో బాధిత రైతుల సంఖ్య కూడా ఏటా పెరుగుతోంది. మండలంలోని లింగారెడ్డిపాలెం శివారు నక్కవానిదారి గ్రామంలో పరిస్థితి ఇది. 2019 నుంచి ఈ ఏడాది వరకు ప్రతి సంవత్సరం నక్కవానిదారి గ్రామంలో డిసెంబర్ నెలలో దుండగులు వరికుప్పలకు నిప్పు పెట్టి పంటను దహనం చేస్తున్నారు.

రెండు రోజుల పాటు ..

ఈ నెల 27, 28 తేదీల్లో నక్కవానిదారి గ్రామంలో ఐదు ఎకరాల వరికుప్పలకు నిప్పుపెట్టారు. 27న అదే గ్రామానికి చెందిన అప్పికట్ల వెంకటేశ్వరరావు (బుజ్జి)కి చెందిన 2.5 ఎకరాల వరికుప్ప, 28న అప్పికట్ల నాంచారయ్యకు చెందిన మరో 2.5 ఎకరాల వరికుప్పలను దహనం చేశారు. ఈ రెండు ఘటనల్లోనే సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. ఇరువురు రైతులూ పొలాలను కౌలుకు తీసుకొని సాగు చేయగా, వీరికి తీవ్రస్థాయిలో నష్టం వాటిల్లింది.

ఆరేళ్లలో పదిమంది రైతుల వరికుప్పలు..

నక్కవానిదారితో పాటు లింగారెడ్డిపాలెం గ్రామంలో కూడా గత ఏడాది వరికుప్పలను దహనం చేశారు. ఆరేళ్లలో సుమారు పది మందికి చెందిన రైతుల వరికుప్పలు దహనమయ్యాయి. సుమారు రూ.12 లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని రైతులు వాపోయారు. వరికుప్పలకు నిప్పు పెడుతున్నారని రైతులు ముందు జాగ్రత్తగా యంత్రాల సహాయంతో కోత జరిపి, యంత్రాలు వెళ్లని ప్రాంతాల్లో వరి కుప్పలు వేస్తే వాటిని కూడా దహనం చేయడాన్ని అన్నదాతలు జీర్ణించుకోలేకపోతున్నారు.

పొలాల వద్ద పడిగాపులు..

రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పండించిన పంటను వరికుప్పలు బుగ్గిపాలు కావడంతో ఏమి చేయాలో తెలియక రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. దీంతో చేసేది లేక రాత్రి వేళల్లో కూడా పొలాల వద్ద పడిగాపులు పడుతున్నారు.

పోలీసులకు సవాలు

ఈ సంఘటనలకు కారకులైనవారిని కనిపెట్టడంలో పోలీసులు విఫలమయ్యారని రైతులు విమర్శిస్తున్నారు. వరికుప్పలు దహనమైనప్పుడు ఘటనా స్థలాన్ని పరిశీలించి హడావుడి చేస్తున్నారే గాని నిందితులను మాత్రం పట్టుకోవడం లేదంటున్నారు. డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేసి పూర్తి ఆధారాలు సేకరించినా కూడా నిందితులను గుర్తించలేకపోవడమేమిటని ప్రశ్నిస్తున్నారు. టెక్నాలజీని ఉపయోగించి క్లిష్టమైన కేసులను కూడా ఛేదించే పోలీసులు ఈ వరికుప్పల దహనం ఘటనలో మాత్రం విఫలమవ్వడం చర్చనీయాంశంగా మారింది.

ఇలాగే కొనసాగితే..

వరికుప్పల దహనానికి కారకులను పట్టుకోకపోతే వారు మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



పసుపులేటి స్రవంతికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న యాజమాన్యం

పామర్రు: విద్యార్థులు తమ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే అనారోగ్య సమస్యలు రావని ఏపీ నేషనల్ గ్రీన్ క్రాఫ్స్ స్టేట్ డైరెక్టర్ పసుపులేటి స్రవంతి పేర్కొన్నారు. స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎస్‌ఎం హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఒత్తిడి లేని విద్యా విధానం ఉత్తమమన్నారు. ప్రతి విద్యార్థీ వ్యక్తిత్వ వికాసం పొందాలన్నారు. ప్రతి పాఠశాల్లో నూరుశాతం ఫలితాలు రావాలని తెలిపారు. అదే విధంగా సేవ్ ఎనర్జీ, సేవ్ వాటర్, సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ఎడాప్ట్ సస్టైనబుల్ ఫుడ్ సిస్టం, రెడ్యూస్ వేస్ట్, ఎడాప్ట్ హెల్తీ లైఫ్ స్టైల్, రెడ్యూస్ ఈ వేస్ట్ మొదలైన అంశాలను విద్యార్థులకు వివరించారు. తొలుత స్కూల్ యాజమాన్యం వారు ఆమెకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అన్నపురెడ్డి పూర్ణచంద్రారెడ్డి, ఎంఈఓ–2 పద్మవాణి, అర్జు ప్రసాద్, లంకపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్యాన్సీ డ్రస్ కాంపిటీషన్



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులోని రవీంద్ర భారతి విద్యాలయంలో మంగళవారం ఫ్యాన్సీ డ్రస్ కాంపిటీషన్ ఉత్సాహంగా జరిగింది. పాఠశాలకు చెందిన చిన్నారులు ఛత్రపతి శివాజీ, స్పైడర్ మాన్, రైతు, పోలీసు, దుబాయ్ షేక్, న్యూస్ పేపర్ డ్రెస్, పలు సాంస్కృతిక వేషధారణలతో ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఊర్వశి మాట్లాడుతూ చిన్నారులకు మన దేశ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఆయా దేశాల పద్ధతులపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. విద్యాసంస్థల చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ శాంతి, అకడమిక్ హెడ్ రమాదేవి, రాజేష్, రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' వర్క్ షాపు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శ్రీ గౌరి

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యాన గత ఐదు రోజులుగా జరుగుతున్న 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' వర్క్ షాపు మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఈసీఈ విభాగాధిపతి శ్రీ గౌరి మాట్లాడుతూ ఐవోటీ ఇంటర్‌షిప్ చేయడం, డివైజ్ కోడింగ్ నేర్చుకోవడం ద్వారా మంచి వేతనాలతో ఉద్యోగాలు సాధించగలరన్నారు. రిసోర్స్‌పర్సన్, శాస్త్రవేత్త మురుగన్ ఐవోటీ, ఐవోటీ డివైజ్ ప్రోగ్రామింగ్, వైర్‌లెస్ ఇంటర్‌ఫేస్ వంటి అంశాలపై అవగాహన పరిచారు. ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ ఐవోటీ ఉపయోగించి ఫైనల్ ఇయర్ విద్యార్థులు ప్రాజెక్టులు చేయడం ద్వారా ఉన్నత ఉద్యోగాలకు కావాల్సిన జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని పెంపొందించుకోగలరని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యాన్ష్ ఢాకరే, కళాశాల సెక్రటరి శ్రీ కృష్ణ, టీపీవో శివనాగేశ్వరరావు, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో మెరుగైన ఉద్యోగాలు

ఉంగుటూరు: సాంకేతిక నైపుణ్య శిక్షణతో మెరుగైన అవకాశాలు పొందవచ్చని ప్రిన్సిపాల్ జీవీకేస్వీ ప్రసాద్ అన్నారు. తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఐబీఎం కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో బీటెక్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ అశ్విన్‌కుమార్ మాట్లాడుతూ ఐబీయం స్కిల్ బుల్డ్ వెబ్‌సైట్‌లో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ తరగతులతో ఎసైన్‌మెంట్ పూర్తి చేసి సాంకేతిక ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా అందుబాటులో ఉన్నాయన్నారు. చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, విభాగాధిపతులు పాల్గొన్నారు.

బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలి



డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందిస్తున్న బుడగ జంగం ప్రతినిధులు

కంకిపాడు: బేడ(బుడగ), జంగాలను ఎస్సీ కులంలో చేర్చి తమ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని బేడ(బుడగ), జంగం కుల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రచారకర్త పి.తిరపతిరావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. తిరుపతిరావు మాట్లాడుతూ బేడ(బుడగ) జంగం ఎస్సీ కులానికి చెందినదన్నారు. తెలంగాణ నుంచి వలస వచ్చి కంకిపాడు పట్టణంలో నివాసం ఉంటున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ జాబితాలో తమ పేర్లు లేకపోవడం బాధాకరమన్నారు. ఎస్సీ కులానికి చెందిన తమ పేర్లను జాబితాలో చేర్చి ఎస్సీ వర్గీకరణ జాబితాలో తగు ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బేడ (బుడగ) జంగంను ఎస్సీ జాబితాలో చేర్చి న్యాయం చేయాలన్నారు. నిదానం సుబ్బారావు, ఎం.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీను, కె.చింతయ్య, లంకయ్య, ఎం.రాయప్ప పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు మాజీ సర్పంచ్ పరిమి రమేష్ 66వ జయంతిని పురస్కరించుకుని కుమారులు పరిమి వంశీ, కోడలు సింధూరలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం రూ. 40 వేలు విలువ జేసే స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. ప్రతిభ గల పేద విద్యార్థులకు తమ వంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అలాగే పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు రూ. 50వేలు ఆర్థిక సహాయం అందించారు.

తాగునీటి పథకాలను పూర్తి చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): రానున్న వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడకుండా పథకాల పనులన్నీ సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడకుండా తాగునీటి పథకాల పనులు, ఫిల్టర్ బెడ్లు మరమ్మతులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనులు ఆలస్యమవుతున్నాయన్నారు. పనుల్లో పురోగతి లేకపోవటం పట్ల కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. చేపట్టిన పనులు నాణ్యతతో త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. పూర్తయిన పనుల బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లింపుల కోసం అప్‌లోడ్ చేయాలన్నారు. గుత్తేదారులకు వెంటనే బిల్లులు చెల్లించాలన్నారు. ఫిబ్రవరి నెలాఖరుకు చేపట్టిన పనులన్నీ పూర్తి కావాలన్నారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారి నటరాజ్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ రాయన్న, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సంతోషమే సగం బలం

జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు



సురేష్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్పీ ఆర్ గంగాధరరావు, ఏఆర్ ఏఎస్పీ సత్యనారాయణలు

కోనేరుసెంటర్: రిటైర్డ్ ఉద్యోగులకు సంతోషమే సగం బలాన్ని ఇస్తుందని ఉద్యోగ విరమణ పొందిన ప్రతి ఒక్కరూ తమ శేష జీవితాన్ని సంతోషంగా గడపేందుకు ప్రయత్నించాలని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు తెలిపారు. మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎస్.సురేష్ కుమార్ రెడ్డిని మంగళవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ చేస్తున్న వృత్తి, ఉద్యోగం పట్ల గౌరవం, నిబద్ధతే ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించడానికి అవకాశం కల్పిస్తుందన్నారు. త్వదార చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపునిస్తాయని తెలిపారు. పని చేసిన చోట మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకుంటే రిటైర్మెంట్ వరకు ఆ మంచి, జీవితాంతం నిలుస్తుందన్నారు. ఉద్యోగ విరమణ పొందినప్పటికీ 34 సంవత్సరాల సుదీర్ఘకాలంలో మీ అనుభవాలు పోలీస్ శాఖకు ఎంతో అవసరమవుతాయన్నారు. శాఖాపరంగా ఎటువంటి అవసరం వచ్చినా పోలీస్ శాఖకు అందించాలని కోరారు. ఆరోగ్యం పట్ల పూర్తిశ్రద్ధ వహించి ఆయురారోగ్యాలతో జీవించేందుకు ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వీవీ నాయుడు, ఏఆర్ ఏఎస్పీ బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు



కొమ్మారెడ్డి స్కూలులో 2025 ఆకారంలో విద్యార్థులు



సెయింట్ జాన్స్ స్కూలులో 2025 ఆకారంలో విద్యార్థులు

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం హైస్కూలు, సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూళ్లలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఒకటో తేదీన పాఠశాలలకు సెలవు నేపథ్యంలో మంగళవారం విద్యార్థులను 2025 అంకెల ఆకారంలో కూర్చోబెట్టి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. కేక్ కట్ చేశారు. ఆయా పాఠశాలల డైరెక్టర్లు కొమ్మారెడ్డి కిషోర్, షాబూజాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సమాజ పరిస్థితులపై అవగాహన అవసరం



వెజిటబుల్ మార్కెట్ ప్రారంభంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్

గన్నవరం రూరల్: విద్యార్థులు చదువుతో పాటు సమాజ పరిస్థితులపై చిన్న నాటి నుంచే అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరమని గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన వెజిటబుల్ మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. దీనికి ఎంతో కృషి చేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ షేక్ ఇమాం, ప్రిన్సిపాల్ జాకీరా సుల్తానా అభినందనీయులని చెప్పారు. విద్యార్థులు కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసి రైతుల వేషధారణలో అమ్మకాలు చేశారు. తూకంలో తేడాలు, మోసాలు తల్లిదండ్రులకు వివరించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులకు కూడా మార్కెట్ మోసాలపై అప్రమత్తత ఏర్పడుతుందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ నానారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అజీజ్ ఉల్లా, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోరంకి-నిడమానూరు రోడ్డు పరిశీలన



నిడమానూరు రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్ భవానీప్రసాద్

పెనమలూరు: పోరంకి గ్రామ పరిధిలో పోరంకి-నిడమానూరు రోడ్డును విస్తరించడానికి తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ భవానీప్రసాద్ మంగళవారం పరిశీలించారు. పోరంకి-నిడమానూరు రోడ్డు మాస్టర్‌ప్లాన్ ప్రకారం డ్రెయినేజీలతో కలిపి 80 అడుగుల వెడల్పు ఉండాలి. అయితే రోడ్డు ఆక్రమణలతో కనీసం 20 అడుగులు కూడా లేదు. పైగా డ్రెయినేజీలు ఆక్రమణలకు గురికావడంతో మురుగునీరు పారుదల జరగడం లేదు. దీంతో రోడ్డు విస్తరణ, డ్రెయినేజీ పనులు చేపట్టడాని మున్సిపాలిటీ సన్నాహాలు చేపట్టింది. ఇందులో భాగంగా పనులు ఏ విధంగా చేయాలనే విషయమై ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మార్కింగ్ ఇచ్చామని, ఆక్రమణ దారులు స్వచ్ఛందంగా తప్పుకోవాలని సూచించారు. త్వరలో రోడ్డు విస్తరణ, డ్రెయినేజీ పనులు చేపడతామన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

గన్నవరం: దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు తమవంతు తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం కేంద్ర ప్రభుత్వం, హిందుస్థాన్ ఏరోనాటికల్ సంయుక్త సహకారంతో 154 మంది దివ్యాంగులకు రూ. 27.14 లక్షల విలువైన ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ఉపకరణాలను సద్వినియోగించుకోవాలని చెప్పారు. నియోజకవర్గంలో అర్హులైన దివ్యాంగులకు నివేశన స్థలాల పంపిణీకి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విజిలెన్స్ విచారణ కారణంగా నిలిచిపోయిన గ్రావెల్ తవ్వకాలను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధిలో కూటమి నేతలందరూ తనతో కలిసి రావాలని కోరారు. ఎంపీడీఓ టి. స్వర్ణలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత దావాజీగూడెంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని యార్లగడ్డ ప్రారంభించారు.